## ఇద్దరు ఏపీవోలపై సస్పెన్షన్ వేటు



**నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేసినందుకు..**

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, ఫిబ్రవరి 6 : 2023–24 సంవత్సరంలో భాగంగా నర్సరీల నిర్వహణలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఏపీవోలను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జిల్లాలో చేపడుతున్న వివిధ పనుల పురోగతిపై నిర్వహించిన దృశ్య సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా నర్సరీల నిర్వహణలో అలసత్వం వహించిన పూడూరు మండల ఏపీవో రాములు, కులకచర్ల ఏపీవో వెంకటేశ్వర్‌గౌడ్‌లను సస్పెండ్ చేశామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందున సంబంధిత ఎంపీడీవోలకు వారం రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణతకు చర్యలు తీసుకోండి


**జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి**

**పదో తరగతి పరీక్షలపై ఉపాధ్యాయులతో సమీక్ష**



మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, ఫిబ్రవరి 6 : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మోమిన్‌పేట జూనియర్ కాలేజ్‌లో మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి మండలాల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ, మాడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక తరగతుల నిర్వహణతోపాటు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి మండలాల విద్యాధికారులు గోపాల్, విద్యాసాగర్, చంద్రప్ప, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ మాడల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.




# సాగునీటి హక్కుల కోసం కొట్లాడుడే..

**మరో ఉద్యమానికి బీఆర్ఎస్ సన్నద్ధం.. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఉమ్మడి రంగారెడ్డి నేతలకు దిశా నిర్దేశం**

రంగారెడ్డి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం పోరాడేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణను సాధించి హక్కులను కాపాడుకున్న స్ఫూర్తితోనే మరో ప్రజా ఉద్యమానికి పార్టీ శ్రేణులు సన్నద్ధులు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేఆర్ఎంబీ అంశంపై కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరయ్యారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలకు నష్టం వాటిల్లేలా కృష్ణా ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈనెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలంటూ సమావేశంలో కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, వివేకానంద, అరెకపూడిగాంధీ, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, పైలట్ రోహిత్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌లు సత్తు వెంకటరమణారెడ్డి, రాజూగౌడ్, కార్తిక్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వికారాబాద్‌కు ఎమ్మెల్సీ కవిత రాక



ఎమ్మెల్సీ కవిత

వికారాబాద్, ఫిబ్రవరి 6 : వికారాబాద్ జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే బీసీ సంఘాల చర్చా వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరు కానున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గౌలికర్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10 గంటలకు బీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగనున్నది. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఎదుట జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు చర్చా వేదిక కార్యక్రమం జరుగుతున్నది. పూలే యునైటెడ్ ఫ్రంట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి బడుగు బలహీన వర్గాల సంఘాలు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

## జిల్లాలో 9 మంది ఎస్‌ఐల బదిలీ

వికారాబాద్, ఫిబ్రవరి 6 : వికారాబాద్ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న 9 మంది ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం తెలిపారు. మోమిన్‌పేట పీఎస్‌లో విధులు నిర్వహించిన విఠల్‌రెడ్డి కరణ్‌కోట్ పీఎస్‌కు, తాండూరు పీఎస్‌లో విధులు నిర్వహించిన అరవింద్‌ను మోమిన్‌పేట పీఎస్‌కు బదిలీ చేశారు. చన్గోముల్ పీఎస్‌లో విధులు నిర్వహించిన గిరెన్నను పెద్దేముల్ పీఎస్‌కు బదిలీ చేశారు. కరణ్‌కోట్ పీఎస్‌లో విధులు నిర్వహించిన మధుసూదన్‌రెడ్డిని చన్గోముల్ పీఎస్‌కు బదిలీ చేశారు. వికారాబాద్ రిజర్వులో ఉన్న రమేశ్‌ను బషీరాబాద్ పీఎస్‌కు బదిలీ చేశారు. బషీరాబాద్ పీఎస్‌లో విధులు నిర్వహించిన వేణుగోపాల్‌గౌడ్‌ను ధారూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ధారూరు పీఎస్‌లో విధులు నిర్వహించిన సంతోష్‌కుమార్‌ను పరిగి పీఎస్‌కు బదిలీ చేశారు. పరిగి పీఎస్‌లో విధులు నిర్వహించిన సత్యనారాయణ, పెద్దేముల్‌లో విధులు నిర్వహించిన కాశీనాథ్‌లను వీఆర్(వికారాబాద్ రిజర్వు)కు బదిలీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## విశ్వ కర్మ స్కీంలో అర్హులకు రుణం అందించాలి

**–జిల్లా కలెక్టర్ శశాంక**

రంగారెడ్డి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : పీఎం విశ్వకర్మ స్కీంలో అర్హులైన చేతివృత్తుల వారిని గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి రుణం అందించేందుకు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం విశ్వకర్మ జాయింట్ కమిటీ మీటింగ్ కలెక్టర్ శశాంక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈ పథకానికి 18 కుల వృత్తుల పనులు చేస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం ఇవ్వడంతోపాటు 15వేల రూపాయల టూల్ కిట్‌ను ప్రోత్సాహకంగా అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి, డీసీబీ అధికారిణి ధాత్రి దేవి, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారిణి సంధ్యారాణి, జిల్లా మెప్మా పీడీ శంకర్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

### రోజువారీగా చేపట్టే పనులు

**7వ తేదీ బుధవారం..**

- గ్రామసభ నిర్వహించాలి. గ్రామంలోని మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులను ఆహ్వానించి ప్రత్యేకాధికారుల పాలనను వివరించాలి. గ్రామంలో పర్యటించి తాగునీరు, పారిశుధ్యం, ఇతర సమస్యలను గుర్తించి, పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలి. రోడ్లను శుభ్రం చేయడంతో పాటు గుంతలను పూడ్చి వేయాలి. రోడ్డు పక్కన నాటిన మొక్కల మధ్య పెరిగిన కలుపు మొక్కలను తొలగించాలి.

**8వ తేదీ గురువారం..**

- రోడ్లన్నింటినీ శుభ్రం చేసి గుంతలను పూడ్చాలి. జాతీయ రహదారులపై ఉన్న మట్టి దిబ్బలు, చెత్త కుప్పలను తొలగించాలి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా మట్టితో పూడ్చి వేయాలి. ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించాలి. రహదారి ప్లాంటేషన్ మధ్య కలుపు మొక్కలను తొలగించాలి. పడిపోయిన చెట్లను సరి చేయాలి. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటాలి.

**9వ తేదీ శుక్రవారం..**

- గ్రామంలోని అన్ని రోడ్లను శుభ్రం చేయాలి. డెంగీ వ్యాధికి కారణమయ్యే దోమల వృద్ధిని అరికట్టడానికి ప్రతి శుక్రవారం డ్రై డేగా ప్రకటించాలి. పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి డ్రై డే వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలి. నీటి తొట్లు, పాత టైర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, పాత కూలర్లు మొదలగు వాటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. నర్సరీలను ప్రత్యేకాధికారులు విధిగా సందర్శించాలి.

**10వ తేదీ శనివారం..**

- రోడ్లకు ఇరువైపులా ఉన్న కలుపు మొక్కలు, గడ్డి, ముళ్ల పొదలను తొలగించాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ భవనాలు, వాటర్ ట్యాంకులు, ప్రభుత్వ దవాఖానలు, భవనాలు, ఖాళీ ప్లాట్ల వద్ద ఉన్న చెత్త, కలుపు మొక్కలను తొలగించాలి.

**11వ తేదీ ఆదివారం..**

- తాగునీటికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలి. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయాలి. పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతు చేయాలి. గ్రామంలోని ప్రతి తాగునీటి ట్యాంకునూ ప్రతినెలా 1, 11, 21వ తేదీల్లో తప్పనిసరిగా శుభ్రం చేయాలి. ట్యాంకులో క్లోరినేషన్ చేయాలి. తాగునీటి వృథాను అరికట్టడానికి ప్రతి ఇంటికీ ఆన్ ఆఫ్ బిగించాలి. బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. దోమల మందు పిచికారీ చేయాలి. పని చేయని బోర్లు, పాత బావులను పూడ్చి వేయాలి. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించేలా చర్యలు తీసుకోవాలి. గ్రే వాటర్‌ను ఇంకుడు గుంతల్లోకి, కిచెన్ గార్డెన్‌లకు మళ్లించేలా అవగాహన కల్పించాలి. కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. ఒక గుంత ఉన్న మరుగుదొడ్డికి మరొక గుంతను తవ్వే విధంగా చూడాలి.

**12వ తేదీ సోమవారం..**

- మురికి కాల్వలను శుభ్రం చేయాలి. తరుచుగా చెత్త వేసే ప్రాంతాలను శుభ్రం చేయాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి.

**13వ తేదీ మంగళ వారం..**

- పాఠశాల విద్యార్థులకు, దేవాలయాల దగ్గర గల షాపులు, హోటళ్లలో వారికి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించాలి. ప్లాస్టిక్ రహితంపై చర్చించాలి.

**14వ తేదీ బుధవారం..**

- పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయాలి. లీకేజీల వల్ల తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం చేసి వంద శాతం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

**15వ తేదీ గురువారం..**

- గ్రామసభ సర్పంచ్ సామాజిక రుగ్మతలైన మద్యపానం, ధూమపానం, గుట్కా, తంబాకు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత నైపుణ్యాభివృద్ధికి ఇస్తున్న శిక్షణలను వివరించి ఉపాధికి మార్గనిర్దేశం చేయాలి. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా మారడానికి ర్యాలీలు నిర్వహించాలి. బాగా పని చేసిన సిబ్బంది, యువజన, మహిళా సంఘాలు, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం చేయాలి.






గొల్లూరుగూడ గ్రామంలో కలుపు మొక్కలను తొలగిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

# పల్లె పరిశుభ్రం

## నేటి నుంచి శానిటేషన్ స్పెషల్ డ్రైవ్..



- ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు
- రంగారెడ్డి జిల్లాలో 559, వికారాబాద్ జిల్లాలో 566 గ్రామ పంచాయతీల్లో నిర్వహణ
- సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల నియామకం
- రోడ్లు శుభ్రం, కలుపు మొక్కల తొలగింపు, పైపులైన్ లీకేజీలు సరి చేయడం వంటి పనులు
- పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం ఆదేశాలు
- వారం రోజులపాటు యువత, మహిళలు, ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యంతో నిర్వహణ

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 6 : పరిశుభ్ర గ్రామాలే లక్ష్యంగా వారం రోజుల పాటు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై ఇటీవల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ఫిబ్రవరి 1వ తేదీన ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. వీరంతా 2వ తేదీ నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం, తాగునీటి సమస్య, పైపులైన్ లీకేజీలను సరిచేయడం తదితర పనులను చేయనున్నారు. వికారాబాద్ జిల్లాలోని 566 గ్రామాల్లో నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

**రంగారెడ్డి జిల్లాలో 559 గ్రామ పంచాయతీలు..**

జిల్లావ్యాప్తంగా 559 గ్రామ పంచాయతీలకు గాను 252 మంది ప్రత్యేకాధికారులను కేటాయించడం జరిగింది. చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు (కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో, మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి జీపీల రూపురేఖలు మార్చింది. సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టింది. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారులతో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టనున్నది.


**అందుబాటులో ఉన్న నిధులతోనే..**

పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయించలేదు. గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు ఉన్న నిధులతోనే పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో మహిళా సంఘాలు, యువతతో పాటు ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



బొంరాస్‌పేటలో ఇండ్ల మధ్యే నిలిచిన మురుగు నీరు

### స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలి..



ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో నేటి నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చాం. గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకోవాలి. అందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– తరుణ్‌కుమార్, వికారాబాద్ డీపీవో

## సీఎంఆర్ బియ్యం ఇవ్వకుంటే బ్లాక్ లిస్టులో పెడుతాం

**• జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మనోహర్‌కుమార్ రాథోడ్**

ఆమనగల్లు, ఫిబ్రవరి 6 : రైస్ మిల్లర్లు సీఎంఆర్ కింద తీసుకున్న వడ్లను మిల్లింగ్ చేసి లేవీ బియ్యాన్ని నిర్ణీత సమయానికి భారత ఆహార సంస్థకు అప్పగించాలని, లేకుంటే మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టి శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మనోహర్‌కుమార్ రాథోడ్ స్పష్టం చేశారు. పలు రైస్ మిల్లుల్లో మంగళవారం జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, టెక్నికల్ ఇన్‌చార్జి స్వప్న, డీటీలు మాచన రఘునందన్, హైదర్ అలీఖాన్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఆయా మిల్లుల్లో దస్త్రాలు పరిశీలించి నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ కింద ఇచ్చిన వడ్లకు బియ్యాన్ని త్వరితగతిన అప్పగించాలని ఆయన మిల్లర్లకు సూచించారు.

పోలేపల్లిలో రైస్‌మిల్లు తనిఖీలో మనోహర్‌కుమార్ రాథోడ్, డీటీలు రఘునందన్, హైదర్ అలీఖాన్

